సాక్షి కామారెడ్డి
మంగళవారం । 18 । జూలై । 2023



ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో..
ట్రాన్స్‌ఫార్మర్లనుంచి కాయిల్స్ ఎత్తుకెళ్తున్న ముఠా సభ్యుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- 8లో ▸



డిమాండ్లు నెరవేర్చాలి
డిమాండ్లను పరిష్కరించాలంటూ సర్కారు బడులలో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /21.5

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బదిలీ అయిన అదనపు కలెక్టర్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్: నాగర్‌కర్నూలుకు బదిలీ అయిన అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను సోమవారం పతంజలి యోగా సమితి ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ పతంజలి యోగా సమితి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తుండడాన్ని అభినందించారు. జిల్లా ప్రజలు చూపిన ఆదరాభిమానాలను మరువలేనన్నారు. కార్యక్రమంలో పతంజలి యో గా సమితి జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, యోగాచార్యులు అంజయ్య, ప్రధాన కార్య దర్శి బాసెట్టి రఘుకుమార్, పెట్టుగాడి అంజయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

‘నిజాంసాగర్’లోకి 773 క్యూసెక్కుల రాక



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 773 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలకుగాను సోమవారం సాయంత్రానికి 3.252 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ప్రధాన కాలువకు నీటి విడుదల
వానాకాలం సీజన్‌కు సంబంధించి సాగు అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు సోమవారం నీటి విడుదల చేపట్టారు. 250 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్‌లు


- 5 కిలోమీటర్లకు నెలకు రూ. 500

ఖలీల్‌వాడి: ప్రయాణికుల ఆర్థిక భారం తగ్గించేందుకు కొత్తగా పల్లెవెలుగు టౌన్ బస్ పాస్‌కు టీఎస్ ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలో తిరిగే పల్లె వెలుగు బస్సుల్లో ఈ పాస్‌ను అమలు చేయాలని సంస్థ నిర్ణయించినట్లు డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) సరస్వతి తెలిపారు. టౌన్ పాస్‌తో ప్రయాణికులు 5 కిలోమీటర్ల పరిధికి రూ. 500లు ధరను సంస్థ ఖరారు చేసినట్లు తెలిపారు. పాస్‌ను జిల్లా కేంద్రాల్లో అమలు చేయాలని ప్రయాణికుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు కొత్తగా పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్‌ను సంస్థ అమలులోకి తెచ్చిందన్నారు. ఈ కొత్త పాస్ మంగళవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులు, చిరువ్యాపారులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. బస్ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040–69440000, 040–23450033ను సంప్రదించాలని కోరారు.

ఓ ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రంలో పేకాట

ఖలీల్‌వాడి : మాక్లూర్ మండలంలోని ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రంలో జోరుగా పేకాట దందా సాగుతోంది. ఈ క్షేత్రంలోకి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లడానికి జంకుతున్నట్లు సమాచారం. ఎందుకంటే స దరు ప్రజాప్రతినిధికి నియోజకవ ర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండదండలు ఎక్కువగా ఉండటమే కారణంగా చెబుతున్నారు. దీంతో ఇది సేఫ్ జోన్‌గా భావించిన పేకాటరాయుళ్లు ఇక్కడ ఆడటానికి ప్రతి రోజు వెళ్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాకు రెగ్యులర్ పోలీస్ కమిషనర్ లేకపోవడంతో కూడా పోలీసులు పేకాట స్థావరంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ పేకాట కేంద్రం నిర్వహణలో మాజీ ప్రజాప్రతినిధి భర్తతో పాటు, ఓ పోలీస్ కానిస్టేబుల్ భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. పేకాట కేంద్రంలో రూ.7 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల చొప్పున రౌండ్స్‌లో గేమ్ ఆడుతున్నట్లు తెలిసింది. ఒక వేళ ఈ పేకాట స్థావరానికి పోలీసులు వెళ్తున్నారనే సమాచారం ఉంటే కానిస్టేబుల్ ద్వారా నిర్వాహకులకు వెంటనే తెలుస్తుంది. వెంటనే అక్కడి నుంచి మకాం మార్చివేస్తారని చెబుతున్నారు. అదేవిధంగా నగరంలోని దుబ్బా ప్రాంతంలోనూ మాజీ ప్రజాప్రతినిధి భర్త, కానిస్టేబుల్ అనుచరుల ద్వారా పేకాట కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

డబ్బులు ఊరికే రావు!



అత్యాశకుపోతే ఖాతాలు ఖాళీ
- కొత్తదారులు వెతుకుతున్న సైబర్ నేరగాళ్లు
- నిత్యం వెలుగు చూస్తున్న మోసాలు
- బాధితుల్లో పలువురు ఉన్నత విద్యావంతులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

■ మూడు వారాల క్రితం జిల్లా కేంద్రానికి చెందిన సమయ్యా ఫిర్దోస్ అనే మహిళకు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఓ మెస్సేజ్ వచ్చింది. పార్ట్ టైం జాబ్ చేస్తూ బాగా సంపాదించవచ్చని ఆ మెస్సేజ్ సారాంశం. ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగం చేస్తూనే పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని అగంతకులు నమ్మించారు. మొదట వందల్లో, తర్వాత వేలల్లో పెట్టుబడి పెట్టించుకుని లాభంతో కూడిన మొత్తాన్ని జమ చేస్తూ నమ్మించారు. వారి ట్రాప్‌లో పడిన ఫిర్దోస్.. విడతల వారీగా రూ. 1.13 లక్షలు చెల్లించింది. ఆ తర్వాత డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసానికి గురైనట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది.

■ కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన సుప్రద సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పక్షం క్రితం ఆమెకు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి మీ కొరియర్ యాక్టివేషన్ నిలిచిపోయిందని చెప్పాడు. రీయాక్టివేట్ చేయడానికి లింక్ పంపిస్తున్నానని, రూ. 5 చెల్లించాలని సూచించాడు. అతడు చెప్పినట్టుగా చేయడంతో కొరియర్ వచ్చింది. కానీ మరుసటి రోజు ఆమె ఖాతాలోంచి రూ. 71,300 మాయమయ్యాయి. సైబర్ నేరం జరిగిందని గుర్తించిన ఆమె పోలీసులను ఆశ్రయించారు.

■ పక్షం క్రితం కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌కు చెందిన ప్రదీప్‌కు ఇన్‌స్టాగాం ద్వారా ఓ మెస్సేజ్ వచ్చింది. తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే త్వరగా అధిక లాభాలు చెల్లిస్తామని నమ్మించారు మోసగాళ్లు. ప్రదీప్ వారి మాటలు నమ్మి మొదట రూ. 5 వేలు, తర్వాత రూ. 10 వేలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని దేవునిపల్లి పోలీసులు ఆశ్రయించాడు.

కామారెడ్డి క్రైం: సైబర్ నేరగాళ్లు మొదట్లో బ్యాంక్ అధికారుల పేరిట ఫోన్‌లు చేసి మోసాలు చేసేవారు. బ్యాంక్ అధికారుల పేరిట వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని పోలీసుశాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, ప్రజలకు కొంత అవగాహన పెరగడంతో మోసగాళ్లు రూటు మార్చారు. ఇటీవలి కాలంలో దేన్నీ వదలడం లేదు. ఉద్యోగాలు, కొరియర్ డెలివరీ, తక్కువ పెట్టుబడికే ఎక్కువ లాభాలు అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకులను టార్గెట్‌గా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. జిల్లాలో 2021 సంవత్సరంలో సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు 115 నమోదయ్యాయి. 2022లో 562 ఫిర్యాదులు రాగా.. కొందరు కేసులను వాపసు తీసుకోవడంతో 294 కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 300 వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇప్పటివరకు 82 కేసులు నమోదయ్యాయి.

మోసగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎరవేస్తూ అమాయకుల ఖాతాలను కొల్లగొడుతున్నారు. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నా అత్యాశకు పోయి పలువురు బలవుతూనే ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్నా..
సైబర్ నేరాల విషయంలో పోలీస్ శాఖ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కళాబృందాల ద్వారా సైబర్ మోసగాళ్లు అనుసరించే విధానాలు, మోసాల తీరుపై అవగాహన కల్పిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి లింకులు క్లిక్ చేయమంటే స్పందించవద్దని, ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని, ఉద్యోగాలు, అధిక లాభాలు అంటూ వచ్చే మెస్సేజ్‌లను పట్టించుకోవద్దని సూచిస్తున్నారు. పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. సైబర్‌నేరగాళ్ల చేతిలో చిక్కుకునే వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. విద్యావంతులూ అత్యాశకుపోయి ఆన్‌లైన్ మోసాలకు గురవుతుండడం విస్మయం కలిగిస్తోంది.

రికవరీ కష్టమే.. అయినా..
ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి పూర్తిస్థాయిలో డబ్బులు రికవరీ చేయడం కష్టమే. ఎందుకంటే ఇలాంటి నేరాలకు పాల్పడే వారంతా ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఉంటున్నారు. నమోదైన కేసులను పరిశీలిస్తే వచ్చే ఫోన్ కాల్స్ ఎక్కువగా ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, బీహార్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలకు చెందినవే ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా మోసానికి గురై డబ్బులు నష్టపోయిన 24 గంటల్లోపు పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీసుశాఖలోని సైబర్ విభాగం ఆ ఖాతాలను ఫ్రీజ్ చేయిస్తుంది. దీంతో డబ్బులు రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆలస్యమైతే రికవరీ కష్టమే అంటున్నారు పోలీసులు.

అప్రమత్తంగా ఉండాలి



నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. నేరం జరిగిన 24 గంటల్లోగా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు గానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలి. వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుంది.
– శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ

‘ఆధునిక సౌకర్యాలతో పార్కు ఏర్పాటు’



పార్కు పనులపై ఆరా తీస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఆధునిక హంగులతో బాన్సువాడలో మల్టీ జనరేషన్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో కల్కి చెరువు వద్ద కొనసాగుతున్న మల్టీ జనరేషన్ పార్కు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ పట్టణం సుందరీకరణలో భాగంగా స్థానిక కల్కి చెరువు వద్ద రూ.4 కోట్లతో మల్టీ జోన్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ఉమెన్, సీనియర్ సిటిజన్, చిల్డ్రన్ పార్కులు ఉంటాయన్నారు. వాకింగ్, యోగా, ధ్యానం చేసుకునేందుకు వీలుగా పార్క్ ఉంటుందని, పిల్లలు ఆడుకోవడానికి సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. రెస్టారెంట్, పార్కింగ్, బాత్రూంలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, కమిషనర్ రమేష్, నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, గురువినయ్, ఎజాస్, కృష్ణారెడ్డి, పాత బాలకృష్ణ, గాదం సత్యం, నర్సన్నచారి తదితరులు ఉన్నారు.

21న ఐటీ హబ్‌లో జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: నిజామబాద్‌లోని ఐటీ హబ్‌లో ఉద్యోగాలు కల్పించడానికి ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

అభివృద్ధి విషయంలో మాట తప్పను



విద్యుత్ కార్యాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు: అభివృద్ధి విషయంలో ప్రజలకు ఇచ్చిన మాట తప్పనని, మడమ తిప్పనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మల్లుపల్లి గ్రామంలో రూ. 85 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తదుపరి భిక్కనూరు మండల కేంద్రంలోని ఆస్పత్రిలో రూ. 26.80 లక్షలతో ఆధునికీకరించిన గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. విద్యుత్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు అధికార దాహంతో సాధ్యం కాని హామీలను గుప్పిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెడతారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు తున్కి వేణు, లలిత శంకర్, ఎంపీటీసీలు చంద్రకళ, సరస్వతి, బాబు, నాయకులు బోడ నరేశ్, నారాయణ, బోయిన మాధవి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాతో ధీమా!

- బీమా పథకంలో పేర్ల నమోదుకు అవకాశం
- వచ్చేనెల 5వ తేదీ వరకు అవకాశం



నాగిరెడ్డిపేట: అన్నదాతల కుటుంబాలకు రైతుబీమా పథకం భరోసానిస్తోంది. కుటుంబ పెద్దగా ఉండే రైతు ఏదైనా కారణంతో ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకుంటోంది. రాష్ట్రప్రభుత్వం 2018లో రైతుబీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది. బీమా పథకంలో పేరు నమోదు చేసుకున్న రైతు మరణిస్తే.. అతడి నామినీకి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తారు. ఈ పథకం కింద గతేడాదివరకు జిల్లాలో 1.72 లక్షల రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. గతేడాది ఆగస్టు 15 నుంచి ఈ ఏడాది జూన్ 18వ తేదీ వరకు జిల్లాలో 20,099 మంది రైతులు కొత్తగా పట్టాలను పొందారు. ఇందులో అర్హులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు రైతులు బీమాకు అర్హులు. ఆధార్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని వయసును లెక్కిస్తారు. ఎన్నిచోట్ల ఎంత భూమి ఉన్నా ఒక చోటులో ఉన్న భూమి ద్వారా మాత్రమే బీమాపథకంలో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. బీమా కావాలనుకునే రైతు బీమా ఫారాన్ని నింపి సంబంధిత ఏఈవోకుగాని, వ్యవసాయ కార్యాలయంలోగాని అందజేయాలి. పట్టాదారు పాసుపుస్తకంగాని, తహసీల్ కార్యాలయంలో అందజేసిన కాపీతోపాటు పట్టాదారు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను ఏఈవోలకు అందజేయాల్సి ఉంటుంది.

పోడుభూముల పట్టాదారులకూ అవకాశం
ఈ ఏడాది జూన్ 18వ తేదీ వరకు ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తయిన రైతులు వారి పేర్లను రైతుబీమా పథకంలో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది. వీరితోపాటు ఇటీవల పోడుభూములకు పట్టాలు పొందిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గతంలో బీమా పథకంలో పేరు నమోదు చేసుకున్న రైతులు వారి బాండ్లలో జరిగిన తప్పులను సవరించుకునేందుకు, ఆధార్‌కార్డులో ఏమైనా మార్పులు చేసుకున్నా, బాండ్లలో నామినీ పేరును మార్చుకోదల్చిన రైతులు ఈనెల 30వ తేదీలోపు సంబంధిత ఏఈవోలను సంప్రదించి తప్పొప్పులను సవరించుకోవడానికి అవకాశం ఇచ్చారు.

గడువుదాటితే ఏడాది ఆగాల్సిందే
బీమా పథకంలో పేరు నమోదుకు విధించిన గడువులోపు దరఖాస్తు చేసుకోకపోతే బీమా కోసం ఏడాది ఆగాల్సి ఉంటుంది. రైతు బీమా పథకం ప్రారంభించిన మొదటి రెండేళ్లపాటు ఎప్పటికప్పుడు దరఖాస్తులు స్వీకరించి పేర్లను నమోదు చేశారు. దీనివల్ల అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరగడంతో 2020 నుంచి నిబంధనలు మార్చారు. ఏటా వానాకాలంలో మాత్రమే నిర్ణీత గడువులోపు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చేనెల 5వ తేదీవరకు అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



రైతుబీమా పథకంలో పేర్లను నమోదు చేసుకునేందుకు వచ్చేనెల ఐదో తేదీ వరకు గడువు విధించారు. పట్టా పాసు పుస్తకాలు ఉండి రైతుబీమా పథకంలో పేర్లు నమోదు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిర్ణీత గడువులోపు సంబంధిత ఏఈవోలను సంప్రదించి బీమాపథకంలో పేర్లను నమోదు చేయించుకోవాలి.
– విజయశేఖర్, ఏవో, నాగిరెడ్డిపేట

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం సంప్రదించాలని ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులల్లో ప్రవేశం కోసం ముస్లిం, క్రిస్టియన్ బాలురు పాఠశాలకు రావాలని సూచించారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

- ఈనెల 23న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా
- వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది లక్ష్యం
- ప్రభుత్వ విప్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



దోమకొండలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, కామారెడ్డి: నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈ నెల 23న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహించాలని నిర్ణయించారు. 60 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. వెయ్యి మంది ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్‌వంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాపై నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

నియోజకవర్గంలో చదువుకున్న వేలాది మంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షలకు వేలాది మంది హాజరయ్యారు. ఖాళీగా ఉండడం కన్నా ఏదో ఒక ఉద్యోగం చేసుకోవాలని ఆరాటపడుతున్న నిరుద్యోగులు మేళాకు తరలివస్తారని భావిస్తున్నారు. అరవైకిపైగా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని, తమకు కావలసిన ఉద్యోగుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఆయా రంగాల్లో ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేసి ఉద్యోగావకాశం కల్పిస్తాయి. ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు.

విజయవంతం చేయండి
దోమకొండ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 23న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు గంప శశాంక్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్‌మేళాలో 60కిపైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు మత్స్య పారిశ్రామిక సంఘం సమావేశం

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని వీక్లీ మార్కెట్ సమీపంలోగల మున్నూరు కాపు సంఘం ఫంక్షన్ హాలులో మంగళవారం జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో తాత్కాలిక జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని పేర్కొన్నారు. నూతన జిల్లా మత్స్య సంఘం రిజిస్ట్రేషన్‌పై చర్చిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని మత్స్య సంఘాల అధ్యక్షులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

స్పీకర్ దిష్టిబొమ్మ దహనం



బాన్సువాడలో స్పీకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం బాన్సువాడలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు నిరూపించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రి గణేష్, గంగాధర్‌దేశాయ్, అసద్ బిన్ మోసిన్, హన్మాండ్లు, పవన్, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, కాసుల రోహిత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)లో మహిళలకు టైలరింగ్(కుట్టు మిషన్), బ్యూటీ పార్లర్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 19 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. టైలరింగ్, బ్యూటీ పార్లర్ కోర్సుల్లో 30 రోజుల శిక్షణనిస్తారని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి కావాల్సిన మెటీరియల్, బుక్స్, యూనిఫామ్ అందిస్తారని వివరించారు. 19–45 ఏళ్ల ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పదో తరగతి మెమో, 5 ఫొటోలు తీసుకుని డిచ్‌పల్లిలోని ఆర్‌ఎస్‌ఈటీఐ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



బోధన్‌రూరల్: సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో కుక్కల దాడిలో జింక గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు.. కుమ్మన్‌పల్లి శివారులో కుక్కల దాడిలో గాయపడిన జింకను గమనించి గ్రామస్తులు బోధన్ రూరల్ పోలీసులకు అప్పగించారు. జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

పాత నాణేలకు డబ్బులిస్తామని టోకరా

బాన్సువాడ: పాత నాణేలు తీసుకొని డబ్బులు ఇస్తామని ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ.52 వేలు టోకరా వేశారు. ఈ ఘటనపై బాధితుడి తండ్రి సోమవారం బీర్కూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన లక్ష్మయ్య కుమారుడి ఫేస్‌బుక్ ఖాతాలో పాత నాణేలు ఇస్తే రూ.77 లక్షలు ఇస్తామని వీడియో కనిపించింది. దీంతో సదరు నంబర్‌కు ఫోన్ చేయగా మొదట రూ.750 ట్యాక్స్ రూపంలో చెల్లించాలని చెప్పడంతో బాధితులు పంపారు. ఇలా విడతల వారీగా రూ.52 వేలను ఫోన్ పే ద్వారా పంపించారు. తర్వాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బీర్కూర్ ఏఎస్సై సీతారామమ్మ తెలిపారు.

అటవీ భూముల కబ్జాకు యత్నం

- మూడు గ్రామాల మధ్య భూముల కోసం ఘర్షణలు
- ఇటీవల కాలంలో 13 వందల ఎకరాలు దున్నిన వైనం



విఠల్‌వాడి అటవీ శివారులో గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ, పోలీస్ అధికారులు



అటవీ భూములను ట్రాక్టర్‌తో దున్ని హద్దులు ఏర్పాటు చేసుకున్న మూడు గ్రామాల ప్రజలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అటవీ భూముల కోసం గ్రామాల్లో కొట్లాట జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోడు భూములకు పట్టాలు ఇచ్చిన సంగతి తెల్సిందే. దీంతో పట్టాలు రాని వారు ఇంకా కొన్ని రోజులకైనా అటవీ భూములకు పట్టాలు వస్తాయనే ఉద్దేశంతో వాటి ఆక్రమణకు తెగబడుతున్నారు. దీంతో ప్రశాంతంగా ఉండాల్సిన గ్రామాలు, తండాలలో ఘర్షణ నెలకొంటున్నాయి. మండలంలోని విఠల్ వాడి, విఠల్ వాడి తండా, పోచారం తండా పరిధిలో ఉన్న భూమి తమదంటే తమదని మూడు గ్రామాల ప్రజలు వాదన చేసుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం మొదలైంది. కొట్టుకోవడానికి మూడు గ్రామల ప్రజలు సిద్ధం కాగా.. పోలీసులు అటవీశాఖ అధికారులు చేరుకొని వారిని అక్కడి నుంచి పంపించేశారు. పోడు పట్టాల పంపిణీ అటవీశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. ఏ మూల నుంచి అటవీ భూమిని కబ్జా చేస్తారోనని అనుమానం మొదలైంది. రాత్రి వేళల్లో అటవీ శాఖ సిబ్బంది లేని సమయంలో ట్రాక్టర్లతో తమకు నచ్చిన ప్రాంతాన్ని హద్దులుగా నిర్ణయించుకుని మూడు గ్రామాల ప్రజలు సోమవారం దున్ని వేశారు. జుక్కల్ ఫారెస్ట్ రేంజ్ కింద 354,355 కంపార్ట మెంట్ల పరిధిలో సుమారు 13 వందల ఎకరాల అటవీ భూమిని గిరిజనులు నాదంటే నాదని అక్రమంగా ఇటీవల దున్నివేశారు. దీంతో ఈ గ్రామాల నడుమ అటవీ భూముల పంచాయతీ మొదలైంది. అటవీ శాఖ అధికారులు భూముల రక్షణకు ఏం చేస్తారో చూడాలి.

రామ మందిరం భూమికి కంచె ఏర్పాటు

బిచ్కుంద: మండల కేంద్రంలో రామ మందిరం భూములు కబ్జా చేసుకున్నారని ఆరోపిస్తూ చైర్మన్ హాజి బాల్‌రాజ్ సోమవారం షెడ్లు ఆక్రమించుకొని వేసుకున్న హద్దు రాళ్లను తొలగించారు. పిచ్చమొక్కలు తొలగించి భూమికి కంచె ఏర్పాటు చేశారు. సుమారు ఒకటిన్న ఎకరం భూమి కబ్జాకు గురైంది. మండల కేంద్రంలోని రాజుల్లా చౌరస్తాలో సర్వే నెంబరు–1092లో 0.29 గుంటలు, సర్వేనం–1094లో 1.33 గుంటల వ్యవసాయ భూమి మందిరం ఆధీనంలో ఉంది. గతంలో ఉన్న ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు అక్రమాలకు పాల్పడి ప్లాట్ల చొప్పున తక్కువ ధరకు ఇతరులకు విక్రయించారు. కొందరు అక్రమంగా కొనుగోలు చేయగా మరికొందరు ఆక్రమించుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఆలయ భూమిగా ఉంది. ఫిర్యాదు చేసినా ఎండోమెంట్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమించుకున్న వ్యక్తులకు ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి ఉండడంతో అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగువేస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆలయ చైర్మన్ బాల్‌రాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా కబ్జా చేసిన స్థలం వదిలేయాలని ఆక్రమించిన వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నారు. ఆనను పదవి నుంచి తొలగించాలని రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



అక్రమంగా వేసిన హద్దులను తొలగిస్తున్న జేసీబీ

ప్రాజెక్టు వద్ద 'స్కాడా' ఏర్పాటు!

- ఫ్లడ్‌కంట్రోల్ రూం నుంచే గేట్ల ఆపరేటింగ్



కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన స్క్రీన్



ప్రాజెక్ట్ వద్ద ఫ్లడ్ కంట్రోల్ రూం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఫ్లడ్ కంట్రోల్ రూంలో స్కాడా(సూపర్‌వైజరి కంట్రోల్, డాటా అక్విజేషన్) విధానాన్ని ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా పర్యవేక్షణ నియంత్రణ, డేటా సేకరణ పక్కగా ఉంటుందని ప్రాజెక్టు అధికారులు తెలుపుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఆనకట్టపై మరో కంట్రోల్ రూంతో పాటు స్కాడా విధానం ఏర్పాటుకు ప్రభుత్వం వేసవిలో రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో స్కాడా విధానం పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీని ద్వారా ఫ్లడ్ కంట్రోల్ రూంలో నుంచే వరద గేట్లను కూడా ఆపరేటింగ్ చేయచ్చు. ఇది వరకు వరద గేట్లను మ్యాన్‌వల్‌గా గేట్ వద్దకు వెళ్లి బటన్ నొక్కి ఎత్తేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఫ్లడ్ కంట్రోల్ రూం నుంచే బటన్ నొక్కి గేటును ఎత్తేలా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది భారీ వరదలు వచ్చి మిగులు జలాలను గోదావరిలోకి వదిలే పరిస్థితి వస్తే స్కాడ ట్రయల్ రన్ జరిగే అవకాశం ఉంది. దీంతో పర్యవేక్షణ పక్కగా ఉండటంతో ప్రతి నీటి చుక్కకు లెక్క పక్కగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఫ్లడ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల ద్వారా నీటి మట్టాన్ని, గేట్లను పర్యవేక్షించే విధంగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

గొల్లకుర్మలు లేకున్నా.. గొర్రెలు ఇచ్చారట



రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో గొల్లకుర్మలు లేకున్నా గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు ప్రచార ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 14 మందికి రూ.13.25 లక్షలను వెచ్చించి గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు ఫ్లెక్సీలలో పేర్కొన్నారు. తమ గ్రామంలో గొల్లకుర్మలు లేకున్నా అధికార పార్టీ నాయకులు ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు జొన్నాల నర్సింలు అధ్యక్షతన సోమవారం నగరంలో తిలక్‌గార్డెన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదారి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బోడిగం నరేష్, ప్రధాన కార్యదర్శి కొత్వాల్ సాయిబాబ, కోశాధికారి లింగంపల్లి సురేందర్, గౌరవ అధ్యక్షులు సంగెం సాయిలు, గౌరవ సలహాదారులు దేశాయి గంగాధర్, ఉపాధ్యక్షులు జి ప్రభాకర్, హన్మండ్లు, కార్యదర్శులుగా రవితేజ, గంధం నారాయణ, శివ, సాయిలు, సత్యనారాయణ ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన దీపిక (23) చికిత్స పొందుతూ సోమ వారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని స్వర్ణ, శ్యాం దంపతుల కుమార్తె దీపిక. ఆదివారం కుటుంబ కలహాలు కారణంగా ఆమె పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆ స్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థి తి విషమించి సోమవారం మృతి చెందింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం డిమాండ్ చేశారు. సోమవారం వారు మెడికల్ కాలేజీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కళాశాలలో తరచుగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆత్మహత్యలు నివారించడంలో అధికారులు విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య సమన్వయం లేకపోవటంలో అధికారుల పాత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, భాస్కర్, దేవిక, సునీల్, సాయిలు, వంశీ పాల్గొన్నారు.

నిర్వహణ.. నిర్లక్ష్యం

జీజీహెచ్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం



జిల్లా జనరల్ ఆస్పత్రి



ఆస్పత్రి భవనం వెనక వైపు లీకవుతున్న డ్రెయినేజీ పైపులు

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోకి అడుగుపెడితే అంతా ఆగమాగం అన్నట్లుగా ఉంటుంది. ప్రభుత్వం అన్నిరకాలుగా భవనాలు, మౌలిక సౌకర్యాలు కల్పించినప్పటికీ అధికారులు సక్రమంగా పట్టించుకోని దైన్యం నెలకొంది. ప్రతిరోజూ 800 మందికి పైగా అవుట్ పేషంట్లు వచ్చే ఈ ఆస్పత్రిలో పారిశుధ్యం నిర్వహణ విషయంలో పూర్తి నిర్లక్ష్యం కనపడుతోంది. చుట్టూ డ్రెయినేజీల నిర్వహణ విషయంలో ఏమాత్రం పట్టింపు లేకుండా పోయింది. పలుచోట్ల మ్యాన్‌హోల్స్ మట్టితో పూడుకుపోయాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోతోంది. చివరకు మంచినీళ్లు తాగే ప్రాంతాల్లోనూ అపరిశుభ్రత కనిపిస్తోంది. ఏడంతస్తుల భవనానికి అనేక చోట్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. దీంతో పేషంట్లు ఆ కిటికీలకు వస్త్రాలు కట్టుకుంటున్నారు. బాత్రూంలు లీకేజీ అవుతుండడంతో భవనంలోని అన్ని ఫ్లోర్ల నుంచి భారీ లీకేజీలు అవుతున్నాయి. ఆస్పత్రి వెనుక దుర్వాసన వస్తోంది. సోమవారం 'సాక్షి' విజిట్‌లో అధ్వానంగా మారిన పారిశుధ్యంపై తీసిన చిత్రాలు..

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అద్దాలు పగిలిన కిటికీలు



ప్రేమ పేరుతో మోసం : యువకుడిపై కేసు

నవీపేట: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని ఓ తండాకు చెందిన ఓ యువతిని మరో వర్గానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకుని బలవంతంగా మతం మార్చాడు. తరువాత యువతి అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించడంతో మళ్లీ తల్లిదండ్రులను ఆశ్రయించి, మోసపోయినట్లు వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు యువకుడిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



క్రైం కార్నర్

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- రూ.7.60 లక్షల విలువైన కాపర్‌వైర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లను దొంగిలించే ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఏడున్నర క్వింటాళ్ల కాపర్ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న బాన్సువాడ డివిజన్‌లోని పిట్లంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో నిజామాబాద్‌కు చెందిన దండ్ల బాబు గోనె సంచిలో ఏదో వస్తువు తీసుకుని వెళ్తూ.. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకున్నారు. బాబు వద్ద ఉన్న సంచీలో కాపర్ వైర్లు ఉండడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా పలు చోట్ల ట్రాన్స్‌ఫార్లలో ఉన్న కాపర్ వైర్లు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. బాబుపై 16 కేసులు ఉన్నాయని, గతంలో జైల్లో ఉన్న సమయంలో బిచ్కుందకు చెందిన షంశీర్‌సింగ్, నాందేడ్‌కు చెందిన ఫఖర్‌గోరేతో పరిచయం ఏర్పడిందని, ముగ్గురు జైలు నుంచి వచ్చాక కామారెడ్డి జిల్లాలోని పిట్లం, బీర్కూర్, నస్రూల్లాబాద్, బిచ్కుంద, మద్నూర్, గాంధారి, భిక్కనూర్ మండలాల్లో రోడ్ల పక్కన వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న కాపర్ వైర్లను దొంగిలించారని తెలిపారు.

నిందితులు మొదట ట్రాన్స్‌ఫార్మర్లకు సప్లయి అయ్యే మెయిన్ వైరును కర్రతో కొట్టి సరఫరా నిలిచిపోయేలా చేస్తారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసి ఆయిల్ కారిపోగానే షీట్‌ను తొలగించి కాపర్ వైరును ఎత్తుకెళ్తారని ఎస్పీ వివరించారు. కొంత కాపర్ వైరును అక్కడక్కడ అమ్ముకుని, మిగిలిన వైర్లను బీదర్(కర్ణాటక)కు తీసుకెళ్లి విక్రయించే వారని తెలిపారు. అదే క్రమంలో దండ్ల బాబు దొరికాడని, మిగిలిన వైర్లు నిజామాబాద్‌లోని ముబారక్ నగర్‌లో దండ్ల బాబు ఇంటి వద్ద దొరికిందని చెప్పారు. బాబు ఇంటి వద్ద 9.5 క్వింటాళ్ల కాపర్ వైరు దొరికిందని, దీని విలువ రూ.7.60 లక్షలు ఉంటుందన్నారు. మరొక దొంగ బిచ్కుందకు చెందిన షంశీర్ సింగ్ పరారీలో ఉన్నాడని, నాందేడ్‌కు చెందిన ఫఖర్‌గోరే ఇదే కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్నాడని తెలిపరాఉ. కేసును ఛేదించిన బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, రూరల్ సీఐ మురళి, సీసీఎస్ సీఐ మల్లేశంగౌడ్, పిట్లం ఎస్సై విజయ్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్సై రాజేశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్ శ్రీనివాస్, సుభాష్, హోంగార్డ్ సంగమేశ్వర్‌ను ఎస్పీ అభినందించారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి



సంగీత (ఫైల్)

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ కౌన్సిలర్ పెర్క సంగీత ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. బోనాల పండుగ సందర్భంగా ఉదయం బోనం ఎత్తుకొని వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నిజామాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని శక్కర్‌నగర్ నుంచి ఐదో వార్డు కౌన్సిలర్‌గా ఆమె గెలుపొందారు.

మిట్టపల్లిలో దొంగల బీభత్సం

- పలు ఇళ్లల్లో చోరీ



దొంగతనం వివరాలు తెలుసుకుంటున్న సీఐ కృష్ణ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మరి కొందరి ఇళ్లల్లో దొంగతనం చేయడానికి యత్నించగా అప్పటికే గ్రామస్తులు మేల్కొని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. నాలుగు రోజుల క్రితమే గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, కృష్ణమందిరం ఆలయాల్లో చోరీకి పాల్పడిన విషయం మరవక ముందే మళ్లీ గ్రామంలోని నాలుగిళ్లల్లో దొంగతనం జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయాన్నే చోరీ సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ గ్రామాన్ని సందర్శించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఆర్‌ఏ సురేశ్ ఇంటి తాళాలు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న రూ.లక్షా 50 వేలు, తులం బంగారు కమ్మలు, రెండు తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. బెడిద చిన్న రాజన్న ఇంట్లో నుంచి 10 తులాల వెండి పట్టీలు, రూ.3వేల నగదు, నడిపి రాజన్న ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి రూ.40వేలు నగదు, బంగారు ఉంగరాలు, వెండి బ్రాస్లెట్, ఎల్‌ఈడీ టీవీ తో పాటు భూమి పట్టా పాస్‌పుస్తకాలను కూడా చోరీ చేశారు. అలాగే మాసిపెద్ది స్కూల్ రాజన్న, నడిపి రాజన్న, చిల్ల నడిపి గంగారం ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. రాత్రి వేళల్లో యువత గస్తీ నిర్వహించాలని, గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సీఐ సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



షారుక్ మృతదేహం

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన యూసుఫ్ అలియాస్ షారుక్ (33) సోమవారం గ్రామ సమీపంలోని బతుకమ్మ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య నిఖత్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిఖత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కడుపునొప్పితో యువకుడు..

సదాశివనగర్: కడుపునొప్పి భరించలేక మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. గ్రామానికి కంకటి రాజా సందీప్(24) కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిలో చూపించినా నయం కాలేదు. ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లోకి చొరబడి చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మహాలక్ష్మి మందిరం సమీపంలో విద్యానగర్ కాలనీలో దొంగ ఓ ఇంట్లోకి చొరబడి రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వివరాలు.. కాలనీకి చెందిన రాజవ్వ ఇంట్లో బీడీలు చేస్తూ టీవీ చూస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన దొంగ ఆమెను కిందకు తోసేసి మెడలో నుంచి రెండున్నర తులాల గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే సరికి దొంగ పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం మల్లారెడ్డి చెరువు సమీపంలో బైక్‌పై వెళ్తున్న శ్యామల మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు.